


# నాకు ప్రేమించాలని ఉంది

-ఎన్. సుమన్

సరదాగా సమయం గడుపుతున్న సుమలతకు తల్లి పెళ్లి విషయం ఎత్తినపుడు చాలా చిరాకు పుట్టేది. దీనికి కారణం ఆమెకు ప్రేమించి పెళ్లి చేసుకోవాలని ఉండడమే! ప్రేమ లేకుండా ముక్కూ, మొహమూ తెలియని కొత్త వ్యక్తిని పెళ్లి చేసుకొని, అతనితో జీవితమంతా గడపడం అర్థవిహీనంగా తోచేది ఆమెకు.

'నాకు ప్రేమించాలని ఉంది' అని మనస్సులోనే అనుకొంది సుమలత. ఇలా అనుకున్నప్పుడు ఆమెలో తెలియని ఉద్విగ్నత ఏదో తలెత్తింది. ఆ తలంపే ఆమెకు హాయిని కలగజేసింది. కాని, ప్రేమంటే ఏమిటి? నిజమైన ప్రేమను ఎలా గుర్తించడం? అసలు అటువంటి ప్రేమంటూ సాధ్యమవుతుందా? ఈ విధంగా ఆలోచనలు సాగిస్తున్న సుమలతను అమాయకురాలని గాని, అసంపూర్ణ వ్యక్తిత్వం కలదని

గాని తలంచడానికి వీలులేదు. ఆమె ప్రపంచాన్ని బాగా అర్థం చేసుకుంది. జీవితాన్ని ఆకళింపు చేసుకుంది.

ఆమె యూనివర్సిటీ జీవితాన్ని గడిపి ఈ సంవత్సరమే తీరుబడిగా ఇంట్లో ఉంటూంది. కనీసం ఈ ఒక్క సంవత్సరం విశ్రాంతి తీసుకొని, వచ్చే సంవత్సరం నుండి ఉద్యోగం చెయ్యాలని ఆమె కోరిక.

కాని, ఈ లోపునే ఆమె పెళ్ళి చేసేయాలని ఆమె తలిదండ్రులు ఆరాటపడుతున్నారు. కాని, సుమలత తను కాలేజీ రోజుల్లో విశ్వసించుకున్న విధంగానే ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది.

కాలేజీ రోజులనగానే సుమలతకు తను పి. యు. సి. చదివిన రోజులు జ్ఞాపకం వచ్చాయి. ఆమె పి. యు. సి. లో ఉండగా వాళ్ల సుశీలత్త కొడుకు రాజశేఖరం ఆ కాలేజీలోనే బి. ఎస్‌సి. చదువుతూండేవాడు. బావ రాజశేఖరం, తాను రోజూ కలిసి కాలేజీకి వెళుతూండే వాళ్ళు. ఇంటిలో తమ రిద్దరిని కాబోయే భార్యాభర్తలని జమకట్టి ఎగతాళి చేసేవాళ్ళు.

కాలేజీలోకూడా ఆమె స్నేహితురాళ్ళు పరిహసిస్తుండే వారు, "ఇద్దరు ఇప్పటినుండే కలిసి తిరుగుతున్నారా?" అంటూ.

ఏదో ఆ వయస్సులో. . . ఆ తెలిసీ తెలియని వయస్సులో సుమలతకు బావ ఎంతో అందగాడిలా కనిపించేవాడు. అతనంటే ఏదో గౌరవం, భయం, భక్తీను. ఆ పదహారేళ్ల పిల్లకు అతను ఒక పెద్ద కథానాయకుడులా తోచేవాడు. . . తనను తాను ఒక నాయికగా ఊహించుకొని మురిసిపోయేది. అందరి పరిహాసాలు ఇందుకు ఇంకా దోహదం చేసెవి.

'ప్రేమంటే ఇదే కాబోలు! బావ లేకపోతే బతకగలనా?' అని అనేకసార్లు అనుకొనేది.

రాజశేఖరానికికూడా సుమలతమీద ప్రత్యేకమైన అభిమానం! ప్రతి విషయంలోను ఆమెకు సహాయపడుతూండేవాడు. రికార్డు వర్క్, నోట్సు వ్రాసిపెట్టడం మొదలయిన పనులన్నీ చేసిపెడుతూండేవాడు.

'బావకు తన మీద ఎంత ప్రేమో!' లోలోన ఆనందించేది సుమలత.

సంతోషంలో సంవత్సరం ఇట్టే గడిచిపోయింది. ఉత్తర ప్రదేశ్‌లోని మెడికల్ కాలేజీలో సీటు దొరకడం వల్ల రాజశేఖరం అటు ప్రయాణం కట్టాడు. ఈ సంఘటన సుమలతకు ఆఘాతమయింది. బావను వీడ్కోలు ఇస్తూ ఉత్తరాలు వ్రాయమని మరీ చెప్పి, కన్నీటితో వెనుదిరిగింది సుమలత.

మొదట కొన్ని రోజులు రాజశేఖరం లేని లోటు ఆమెకు భయంకరంగా తోచింది. కాని, అతని ఉత్తరాలు కొంత ఊరట కలిగించేవి. క్షేమసమాచారాలు, కాలేజీ విషయాలు తప్పించి ఏమి వ్రాసుకొనేవారు కారు.

రాను రాను రాజశేఖరం ఉత్తరాల సంఖ్య తగ్గిపోవడంతోబాటు క్రమేపి ఆగిపోవడం సంభవించింది. ఈలోపున సుమలతకూడా కాలేజీ ధ్యాసలో, స్నేహితురాళ్ల సాహచర్యంలో ముందులా బావను పదేపదే తలుచుకోవడం తగ్గించింది. ఆమెకుకూడా ఆశ్చర్యం కలిగేది— ఎలా తను బావను మరిచిపోగలుగుతూందని!

ఆమెకు వయస్సుతోబాటు మనస్సు పరిపక్వత చెందింది. తాను ఇంతకాలం అనుకున్నది ప్రేమ

**ఎవరిలోఅయినా వయసుకు అనుగుణంగానే భావాలు ఉద్భవిస్తూ ఉంటాయి. అన్నీ కాకపోవచ్చు: జీవితాన్ని తీర్చి దిద్దగలిగే కొన్ని అయినా యుక్తమైన వయసులో నెరవేరడంమీద జీవిత సాఫల్యం ఆధారపడి ఉంటుంది. మూలనున్న ముసలమ్మ కత్తిసాము నేర్చుకోలేదు కదా, మరి!**

కాదని, అది బావమీద కేవలం అభిమానమేనని గ్రహించింది. బావకుకూడా తనమీద అట్టి అభిమానమేనని గుర్తించింది. అందుకనే బావ తను పంజాబీ అమ్మాయిని ప్రేమిస్తున్న విషయం చెప్పినప్పుడు తానేమి బాధపడకపోగా చాలా సంతోషించింది. ఎప్పుడూ అతన్ని వేళాకోళం చేస్తూండేదికూడా!

ఆ విధంగా ఒక అధ్యాయం గడిచిపోయింది ఆమె జీవితంలో.

కాలేజీ అబ్బాయిలు సుమలతస్నేహం కోసం ప్రాకులాడేవారు. ఆమె వాళ్లతో ఫ్రీగానే మాట్లాడేది. అబ్బాయిలు, అమ్మాయిలు అనే భేదం లేకుండా అందరితోను స్నేహంగా ఉండేది.

అందరిలో రమేశ్ ఆమెకు అతి సన్నిహితుడయ్యాడు. అతను సుమలత ప్రాణమిత్రురాలయిన శశికి అన్నయ్య. బి. ఎ. చదువుతూండేవాడు.

సుమలత తరుచుగా సెలవు రోజుల్లో శశి ఇంటికి వెళుతూండేది. మొదట్లో ఆమె రమేశ్‌తో అంత చనువుగా మెదిలేది కాని, క్రమేణా వాళ్లిద్దరి మధ్య సన్నిహితత్వం ఏర్పడింది.

ఒకోసారి సుమలత వెళ్ళేసమయానికి శశి ఇంట్లో లేకపోయినా ఆమె వాళ్ళింట్లో ఎంతో స్వేచ్ఛగా తిరిగేది. శశి తల్లి కాంతమ్మగారు చాలా మంచిమనిషి.

ఇక, రమేశ్ అయితే సుమలత ఆగమనం కోసం ఎదురుతెన్నులు చూస్తూండేవాడు. శశి లేని సమయాలో కూడా వాళ్లిద్దరు కారమ్స్ ఆడుకుంటూనో, కబుర్లు చెప్పుకుంటూనో గడిపివేసేవారు. ఆమె అతనితో అన్ని విషయాలు చర్చించేది. ఆమె దృష్టిలో శశి ఎంతో, అతను అంతే!

ఫైనల్ ఇయర్ పరీక్షలకు ముందు ఒకనాడు సుమలత ఏదో పుస్తకం కొరకు శశి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో రమేశ్‌తప్ప ఎవరూ లేరు. ఆమె తిరిగి రాబోతూండగా, "శశి వచ్చే టైము అయింది. కూర్చోండి" అని రమేశ్ బలవంతం చేయడంతో, ఆమెకు కూర్చోక తప్పిందికాదు. అతనుకూడా ఒక కుర్చీ లాక్కుని ఆమెకు ఎదురుగా కూర్చున్నాడు. రెండు నిమిషాలు మౌనంగా గడిచాయి.

రమేశ్ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు.

చివరకు సుమలత నిశ్శబ్దం తొలగిస్తూ, "ఏమండీ, ఎంతవరకు వచ్చాయి స్టడీస్?" అని అతని వైపు చూస్తూ అడిగింది.

"ఫరవాలేదండి, క్లాసు రావచ్చు. అలా అయితే నెక్స్ట్ ఇయర్ ఎమ్. ఎ. చేయవచ్చును. మరి, మీరేమి చేయాలనుకుంటున్నారు?" చివరి మాటలన్నప్పుడు ఆమె వైపు తిన్నగా చూడలేకపోయాడు రమేశ్.

"మా ఇంట్లో పెళ్లి విషయాలు ఎత్తుతున్నారు గాని, నాకు ఎమ్. ఎస్‌సి. చేయాలని ఉంది. అయినా, ప్రేమలేని పెళ్లిళ్ళు విజయవంతం కావని నా అభిప్రాయం. మరి మీ ఉద్దేశ్యం ఏమిటండీ? పెళ్లికి ముందు ఇద్దరు పరస్పరం అర్థం చేసుకోవాలంటారా, లేదా?" ఆమె మాటలతో రమేశ్‌లో ఏదో ఆశ తల ఎత్తింది.

"మీ రన్నది అక్షరాలా నిజం. నాదీ అదే ఉద్దేశ్యం. కొంతవరకు కృతకృత్యుడినయ్యానని తలుస్తున్నాను." ఆమెవైపు అదోలా చూస్తూ అన్నాడు.

"అయితే, మీరు ఎవరినయినా ప్రేమిస్తున్నారా ఏమిటి . . . చెప్పండి . . ." నవ్వుతూ అడిగింది సుమలత.

అవునన్నట్లు తల ఊపాడు రమేశ్.

"గుడ్ న్యూస్! ఎవరండీ ఆ అమ్మాయి?" తొందర పెట్టింది.

"సుమ! నిన్నే నేను ప్రేమిస్తున్నాను . . . మనం పెళ్లి చేసుకుందాం . . ."

అతను ఆవేశంగా ఆమె కుడిచేతిని తన రెండు చేతుల్లోనికి తీసుకున్నాడు.

సుమలత ఒక్కసారిగా ఆఘాతం తగిలినట్లు గభాలున తన చేతిని వెనక్కి తీసుకుంది.

"సారీ, రమేశ్! నే నెప్పుడూ ఆ విధంగా తలంచ లేదు. వస్తా!" అంటూ విసురుగా బయటకు వచ్చేసింది.

ఇంటికి రాగానే ముసుగు పెట్టి ఏడుకున్న కూతుర్ని చూచి సుమలత తల్లి ఆశ్చర్యపోయింది. కారణమేమిటని అడిగితే, తలనొప్పి అని చెప్పి తప్పించుకొంది సుమలత.

ఆమెకు రమేశ్ మాటలే పదేపదే జ్ఞాపకం వస్తున్నాయి! ఛ! ఎటువంటి ఆలోచనలు రమేశ్‌వి! తనెన్నడు అటువంటి ఆలోచనలు అతనిలో కలిగించడానికి దోహదం చేయలేదే! స్నేహంగా మెలిగినంత మాత్రాన అటువంటి ఊహలు ఎలా వస్తాయి? ఒక అబ్బాయి, అమ్మాయి మధ్య స్నేహం సాధ్యంకాదా? ఆ స్నేహం ప్రణయంలోకి దారితీయవలసిందేనా?

సుమలత మనస్సు వికలమయింది. ఆమె ఇంతవరకు ఎవరిని ప్రేమించి ఎరగదు. ఆమె దృష్టిలో ప్రేమ అంటే ఒక మహోత్కృష్టమైన వరం వంటిది. అదొక అతీతమైన శక్తి. అదొక వింత అనుభూతి. ఆమెకు అంతవరకు అట్టి అనుభూతి కలగలేదు. తను రమేశ్‌ని ప్రేమించగలదా? ప్చ్! తనకు శశి ఎంతో, అతను అంతే. . . శశికీ విషయం తెలుసా? రేపు తను ఎదురయితే ఏమంటుందో? ఆలోచనలతో సుమలత తల వేడెక్కిపోయింది. బాధగా కణతలు నొక్కుకుంది.

ఆ మరునటిరోజు శశి తనను తప్పించుకొని తిరగడం గమనించి సుమలత చాలా బాధపడింది. ఆమే తెగించి శశితో మాటలు కలిపింది. కొంతసేపటికి శశి చెప్పింది, తనుకూడా అన్నయ్యమాదిరే ఆశించిందని.

సుమలతకు చిరాకువేసింది ఆమె మాటలకు. స్నేహంగా ఉన్నంత మాత్రాన వీళ్లు ఇలా ఊహాగానాలు చేయటం ఆమెకు వెగటు కలిగించింది. ఏమయితేనేం, తన ప్రవర్తనలో ఏ దోషము లేదు. అది తన అంతరాత్మకు తెలుసు. అదే ఆమెకు తృప్తి.

ఈ విధంగా ఈ సంఘటన ఆమె స్మృతులలో ఇంకో అధ్యాయమయింది.

ఆ తరవాత ఎమ్. ఎస్‌సి. చేయడానికి సుమలత ఉస్మానియా యూనివర్సిటీలో చేరింది. హైద్రాబాదులో ఎవరూ బంధువులు లేనందువల్ల హాస్టల్లో చేరవలసి వచ్చింది. అంతా కొత్త వాతావరణం. అంతా కొత్త వాళ్ళే కాని, బి. ఎస్‌సి. లో క్లాసుమేటు అయిన శంకర్ కూడా ఆమెతోపాటు యూనివర్సిటీలో చేరడం కొంత మేలు!

కాలేజీలో ఉండగా సుమలతకు శంకర్ అంతగా పరిచయం లేదు. కాని, ఈ కొత్త స్థలంలో కాస్త తెలిసినవాడు అతనే కావడంతో ఇద్దరు సన్నిహితులయ్యారు.

శంకర్ స్వతహాగా చలాకీ అయినవాడు. మనిషిలో అంత ఆకర్షణ లేకపోయినా మాటలద్వారా ఇతరులను ఆకట్టుకోడానికి ప్రయత్నించేవాడు. ఎదుటివాళ్ళ భావాలు గమనించకుండగానే తన ధోరని తాను మాట్లాడుతూ పోయేవాడు.

గతంలో రమేశ్‌తో జరిగిన అనుభవంవల్ల ఈసారి అబ్బాయిలతో చాలా తక్కువగా మాట్లాడేది సుమలత. శంకర్‌తో మరీ చనువుగా ప్రవర్తించడానికి భయపడేది.

శంకర్ మాత్రం అతి చనువు తీసుకొని తరుచుగా ఆమె హాస్టల్‌కి వస్తూండేవాడు. మాటల సందర్భంలో అతనె చెప్పుకున్నాడు తమ గ్రామంలో మంగ అనే అమ్మాయిని ప్రేమించానని. ఇటువంటి అనవసర ప్రసంగాలు విన్నప్పుడు సుమలతకు ఏవగింపు కలిగేది. కాని, సభ్యత అడ్డు వచ్చి ఏమి అనలేక మౌనం వహించేది.

ఆ ఆదివారం మామూలుగా హాజరు వేశాడు సుమలత హాస్టల్లో. అలవాటు ప్రకారం ఏవో వాగుతూనే ఉన్నాడు. మాటలమధ్యలో అసందర్భంగా, "మీరు రమేశ్‌ని పెళ్ళి చేసుకుందామనుకున్నారట నిజమేనా?" అని ప్రశ్నించాడు.

సుమలతకు ఒళ్ళు మండిపోయింది.

"అని ఎవరు చెప్పారు?" కోపంగా అడిగింది.

"అతనే!" నొక్కి అన్నాడు శంకర్.

"అలా అని మీతోనే స్వయంగా చెప్పాడా?" విసురుగా అంది.

"ఆఁ. . . నాతో కాదు గాని, మన. . . కాలేజీలో... అందరూ. . ." నసిగాడు నాస్తికంగా.

"హుఁ. ఇదొక జాడ్యం. . . ఎవరైనా నలుగురు గుంటలు ప్రేమాయణాలను గురించి తప్ప కాలేజీల్లో ఇక మాట్లాడుకోడానికి ఏ విషయాలు దొరకవు కాబోలు." విసుక్కుంచింది సుమలత.

"అది కాదండీ. . ." ఏదో చెప్పబోయాడు.

"ఇంకేమీ చెప్పకండి. ఇంతవరకు నేను పెళ్ళి విషయాలే ఆలోచించలేదు. ప్లీజ్! ఇక ఎప్పుడూ ఇటువంటి విషయాలు నా దగ్గర ఎత్తకండి." హూటుగా హెచ్చరించింది.

శంకర్ లోక్యం తెలిసిన మనిషి. కాస్త వర్షిటూరి వాలకం ఉన్నా కొంత గడుసుదనమున్నవాడు కావటంవల్ల మాట మార్చేసి సుమలత కోపం పోగొట్ట గలిగాడు.

ఈ రెండు సంవత్సరాలు శంకర్ తగు జాగ్రత్తతో హద్దు మీరక మెలగుతూ సుమలత స్నేహాన్ని నిలుపుకో గలిగాడు.

పరీక్షలు అయిపోయాయి. ఇక, మరుసటి రోజు ఎవరి స్థలాలకు వాళ్ళు వెళ్ళిపోతారు. ఆ సాయంత్రం శంకర్ యథావిధిగా సుమలత హాస్టల్‌కి వచ్చాడు. మనిషి ఏదో బాధపడుతున్నట్లుగా కనిపించాడు. సుమలతకు కూడా ఆ స్థలాన్ని వదలాలంటే కొంచెం విచారంగానే ఉన్నది.

పిచ్చాపాటి మాటల సందర్భంలో, "ఏమండీ, మంగతో మీ పెళ్ళి ఈ ఎండల్లోనే కదూ! నాకు పంపడం మరిచిపోయేరు..." అని నవ్వుతూ అంది సుమలత.

కాని, ఆమె ఆశించిన విధంగా శంకర్ వైపునుండి చిరునవ్వు కానరాలేదు.

"మీతో చెప్పనేలేదు కదూ! ఇప్పుడు నాకు మంగను చేసుకొనే తలంపు లేదండీ. . ." నసిగాడు శంకర్.

"అయ్యో! అదేం?' ఆశ్చర్యం ప్రకటించింది ఆమె.

"చదువుకున్న అమ్మాయిని చేసుకుందామని ఉంది."

'అఘోరించలేకపోయావ్! ఆ మంగకు ఆశ్ని ఆశలు కల్పించి, ఇప్పుడు ఈ పెడబుద్ధులేమిటి' అని అనాలనిపించినా, మధ్యన తన కెందుకీ గొడవ అని ఊరుకుంది సుమలత.

"మరి మీ పెళ్ళి విషయ మేమిటండీ?" అతని ధోరనకు ఆమె అసహ్యించుకుంది. ఏమీ జవాబు చెప్పకుండా మౌనం దాల్చింది.

"ఏమండీ! మౌనంగా ఉన్నారు? ఎటువంటివాడిని చేసుకోవాలని మీ ఐడియా?"

అతని చూపులు అదోలా ఉన్నాయి. సుమలతకు రమేశ్ జ్ఞాపకం వచ్చాడు. అతనూ ఇలానే చూశాడు ఆ చివరి రోజు.

"చెప్పండి, ఎటువంటి వాడిని చేసుకుందామని..." రెట్టించాడు శంకర్.

'నీలాంటి ఇడియట్‌ని మాత్రం చేసుకోను' అని మనస్సులో కసిదీరా తిట్టుకొని చివరకు అంది, "సీత, విజాయతికి కట్టుబడేవాడిని" అని నొక్కి పలుకుతూ.

"అంటే. . . నేను. . . తగనంటారా?" ఉదోలా విలాసంగా తల ఎగరవేశాడు శంకర్.

అతని తిక్క ప్రవర్తనకు కోపం ఆగలేదు సుమలతకు.

"మా ఎక్కటూరి ప్రేయసిని అప్పుడే మరిచిపోయి' వదుసు అని, హోదా అని పేలు ఏరాయిస్తున్న. . . మీకు. . . సీత, విజాయతి అంటె ఏం తెలుస్తుంది?" ఆమె కటువుగా పలికింది.

చిత్రం—జి. భాస్కరస్వామి (హనమకొండ)



శంకర్ ముఖం వెలవెలబోయింది. ఇక అక్కడ ఉండలేక తక్షణమే వెళ్ళిపోయాడు.

'ఫూల్స్! ప్రేమంటె ఏదో పసబారు వస్తువు అనుకుంటున్నారు.' వాళ్ళనేవటేవరకు తిట్టుకుంటూనే ఉంది సుమలత.

* * *

"చదువు అయిపోయింది కదా! ఇప్పుడన్నా పెళ్ళి చేసుకుంటావా లేదా?" అని తల్లి అడిగింది సుమలత ఇంట్లో అడుగుపెట్టిన రోజునే.

మౌనంగా ఊరుకున్న కూతురిని చూచిన ఆమెకు అనుమానం వచ్చింది. "ఎవరినయినా ప్రేమించావా ఏమిటే కొంపదీసి! అదయినా చెప్పు" అంటూ నిలదీసి అడిగింది.

"ఊహూఁ" అని అన్నంగా తల తిప్పింది సుమలత.

తృప్తిగా నిట్టూర్చింది తల్లి. కాని, వెంటనే "నేను ప్రేమించి గాని పెళ్ళి చేసుకోను" అని సుమలత ఖచ్చితంగా అనడంతో తల్లి తెల్లబోయింది.

ఇంతవరకు తన జీవితంలో తారసపడిన వ్యక్తుల్లో ఎవరిని తాను ప్రేమించలేకపోయింది. దానికి కారణం ఏమిటో తనకే పూర్తిగా అవగాహన కాలేదు. తాను ఎటువంటి వ్యక్తిని కోరుకుంటుంది? అందానికి ప్రాధాన్యం ఇవ్వాలా? లేక చదువు చూడాలా, లేక గుణగణాలకా? ఇవేమి అంతగా పట్టించుకోకుండా ఒక వ్యక్తిని ప్రేమించడానికి వీలవుతుందా? ఏమయినా 'ఎవరిని చూడగానె అతనితో జీవితాంతం గడపాలనే కోర్కె కలుగుతుందో అతనినే ప్రేమించాలి' అను కుంది సుమలత.

సుమలతకు తల్లి దగ్గిర చాలా గారాబం. తండ్రి కూడా కూతురు ఇష్టప్రకారమే జరుపుతూ వచ్చాడు ఇంతవరకు. పెళ్ళి విషయంలోకూడా ఆమెకు సంపూర్ణ స్వేచ్ఛ ఇచ్చారు ఆమె తల్లిదండ్రులు.

* * *

మూడు నెలల క్రితం. . . తండ్రికి ఏదో పనివల్ల వీలు కాలేదని సుమలత డబ్బు కోసం బాంక్‌కి వెళ్ళవలసి వచ్చింది.

అక్కడే ఆమెకు పరిచయమయ్యాడు మధు. అతను బాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతన్ని చూడగానే ఆమె చెప్పలేని తెలియనటువంటి అనిర్వచనీయ అనుభూతి కలిగింది. . . అతన్ని అలానే చూస్తూ ఉండిపోవాలనిపించింది. అతనితో పరిచయం పెంచుకోవాలనిపించింది.

మధుతో పరిచయం క్రమక్రమంగా అధికమయి పోయింది. అతని సౌశీల్యము, మాట్లాడే తీరు ఆమెను ఎంతో నచ్చాయి. అతనికి పెద్ద హోదా లేదనే భావం ఆమెలో కలిగేది కాదు. అతనితోనే తన జీవితం. తను ఇంతకాలంగా కనిపెట్టింది అతని కొరకేనేమో!

అతనికికూడా సుమలతపై అభిమానం అభివృద్ధి అయింది. ఇద్దరూ ఒకరి సాన్నిహిత్యాన్ని ఇంకొకరు గాఢంగా కోరుతున్నారు. మధు సుమలత ఇంటికి వస్తూపోతూనే ఉన్నాడు.

'నాకు ప్రేమించాలని ఉంది.' మధుని తలుచుకుంటూ తియ్యని కలలు కంటూంది సుమలత. ★